సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

| సంపుటి : 02 | సంచిక : 47 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం | 31.05.2025 |
|---|---|---|---|---|



# విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం
- కలెక్టర్ రిజ్వాన్ భాషాతో కలిసి పర్యటించిన శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** రాష్ట్రంలో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తరగతులు ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. శుక్రవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని శివునిపల్లిలో ఉన్న గోలి రామలింగయ్య స్మారక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణ నేపథ్యంలో కళాశాలలో విద్యార్థులకు కనీస వసతుల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి ఎమ్మెల్యే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా కళాశాలో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే కళాశాల లో మౌలిక వసతుల కల్పన కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల కల నెరవేరిందన్నారు. మార్చి నెలలో 8 కోట్ల తో నూతన డిగ్రీ కళాశాల మంజూరు రావడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాలకు అవసరమైన అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ ఏర్పాటుకు మంజూరు రావడం జరిగిందన్నారు. మొత్తం 240 సీట్ల అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్ లో అప్లై చేసుకోవాలన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందుతారని తెలిపారు. నూతన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఏడాది వరకు శాశ్వత డిగ్రీ కళాశాల భవనం విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అందుకు సంబంధించి త్వరలోనే టెండర్స్ పిలవడం జరుగుతుందన్నారు. విద్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కడియం అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులంతా కలిసి డ్రైవ్ చేపట్టి మౌలిక వసతులతో పాటు మంచి ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని విద్యాలయాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం 10 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీఈ, ఆర్డీఓ డీఎస్ వెంకన్న, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో ఎవరికి వారే..

# యమునా తీరే..

- పరస్పర విరుద్ధంగా వ్యాఖ్యలు.. ఆరోపణలు
- కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినా కానరాని మార్పు

3 లో

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# భూ భారతిపై అవగాహన ఉండాలి

**జనగామ, మన చౌరాస్తా:** కలెక్టర్ కార్యాలయంలో భూభారతి పోర్టల్ పై అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా తహసీల్దార్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతి పోర్టల్ లో సూచించిన విధంగా ఒక్కొక్క అంశాన్ని వివరంగా వివరిస్తూ వాటిపై తహసీల్దార్లకు అవగాహన పరిచారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సజావుగా పూర్తి చేస్తూ వేగవంతంగా చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సులపై పంచాయతీ సెక్రటరీలకు షెడ్యూల్ పంపడం జరిగిందని, ఒకరోజు ముందుగానే సంబంధిత గ్రామంలో టామ్ టామ్ చేయించేలాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముందుగా స్వీకరించిన దరఖాస్తులను సబ్జెక్టుల వారిగా విభజించుకోవాలని తద్వారా వేగవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. నిర్దేశించుకున్న లక్షాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. సంబంధిత గ్రామాలకు వెళ్లి అధికారులకు ఆయా గ్రామాల భూ రికార్డులు తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో జనగామ ఆర్డిఓ గోపి రామ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమంత నాయక్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు



# సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలి

## డీఎంహెచ్‌వో ఆఫీస్‌ను తనిఖీ చేసిన హెల్త్ డైరెక్టర్




**జనగామ, మన చౌరాస్తా :** సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ బి.రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం జనగామ డీఎం హెచ్ వో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, ప్రోగ్రాం అధికారులతో ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. టి.బి కార్యక్రమం గురించి సమీక్ష నిర్వహించి నోటిఫికేషన్లను పెంచాలని సూచించారు. జిల్లాను అన్ని ప్రోగ్రాంలలో మొదటి స్థానంలో ఉంచాలని సూచన చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎటువంటి వ్యాధులు ప్రభలకుండా ఫీవర్ సర్వేలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, ప్రోగ్రాం అధికారులు తరచుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో డీఎం హెచ్ వో మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


# విద్యారంగంలో జనగామకు మొండి చేయి : యాసారపు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో రూ.200 కోట్లతో పెట్టాల్సిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జనగామకు మంజూరు కాకపోవడం ఇక్కడి కాంగ్రెస్ నాయకుల చేతకానితనం నిదర్శనమని మాదిగ మేధావుల ఫోరం జనగామ జిల్లా కన్వీనర్ యాసారపు కరుణాకర్ అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు అనుమతులు ఇచ్చారు కానీ జనగామ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గంలో కూలిపోయిన కల్వర్టులకు, చిటకోడూర్ వాగు మీద బ్రిడ్జి, వడ్లకొండ-గానుగుపహాడ్ మధ్యలో ఆగిపోయిన వంతెన పనులకు నిధులు మంజూరు కాకపోవడం, అనుమతులు రాకపోవడం కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతకానితనం, స్థానికేతరుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే కావడం అని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ తయారు కాలేదు, ఇండ్లకు ముగ్గులు పోయలేదని, అసలు నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నదా లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికీ అయినా జనగామ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని లేకుంటే ప్రజా సంఘాలు, యువజన సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

# పద్యసాహిత్యానికి కేరాఫ్ జనగామ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష ఉపాధ్యాయులకు రెండవ దశ శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'తెలుగు పద్య వైభవం' అంశం మీద అష్టావధాని చేపూరి శ్రీరాం విస్తృత ఉపన్యాస చేశారు. నన్నయ నుంచి నేటి దాకా తెలుగు పద్యం విస్తృత పరిణామ వికాసాలను, వస్తు వైవిధ్యాలను తనతో సమ్మిళిత పరచుకొని చైతన్యవంతంగా పురోగమిస్తోందని తెలిపారు. సోమన, పోతనల జన్మస్థలమైన జనగామ జిల్లాకు విశేషమైన సాహిత్య, సాంస్కృతిక నేపథ్యం ఉందని ఇక్కడ భాషోపాధ్యాయులుగా పనిచేయడం తెలుగు ఉపాధ్యాయుల మహద్భాగ్యమని పేర్కొన్నారు. సమావేశానికి కోర్సు డైరెక్టర్ నోముల సత్యనారాయణ అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆహ్వానితులుగా ఏఎంవో బి.శ్రీనివాస్, ఎస్ ఆర్పీ డాక్టర్ జయప్రకాశ్ హాజర్యారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్యపీఠం అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి , డీఆర్పీలు శేషకుమార్, రజితకుమారి, బలరాం, లక్ష్మణ్ బాబు, నరేందర్, ఉపేందర్ రెడ్డి, అన్నపూర్ణ, పద్మ, స్వరూప, హేమలతతో పాటు తెలుగు భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.





## దేవాదుల భూ సేకరణ

# స్పీడప్ చేయాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, మన చౌరాస్తా : దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కి సంబంధించి అలాగే ప్యాకేజి 7 నవాబ్ పేట రిజర్వాయర్, చీటకోడూరు రైట్ మెయిన్ కెనాల్, అశ్వరావుపల్లి రైట్ మెయిన్ కెనాల్ భూసేకరణ పనులను అలాగే నష్ట పరిహారం చెల్లింపులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. నేషనల్ హైవే 365 బీకి సంబంధించి (జనగామ నుంచి దుద్దెడా ) భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపులను కూడా వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, ఇరిగేషన్, నేషనల్ హైవే ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

# లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత మోగా వైద్య శిబిరం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలో బచ్చన్నపేట చౌరస్తా వద్ద బంగ్లా లో లయన్స్ క్లబ్ ఆఫ్ బచ్చన్నపేట వారి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం రోజున ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాన్ని బచ్చన్నపేట మండలంలో ఉన్న ప్రతి ఒక్క ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో న్యూరో, జనరల్, స్కిన్, యూరాలజిస్ట్, నేత్ర వైద్యులు, గైనకాలజిస్ట్, షుగర్, బీపీ పిల్లలకు సంబంధించిన వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వారికి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా లయన్ లవ కుమార్ రెడ్డి, కన్నా పరశురాములు, చందుపట్ల రవీందర్ రెడ్డి, జయహరి, ప్రవీణ్ కుమార్, ఈదులకంటి ప్రతాప్ రెడ్డి, చర్ల శ్రీనివాస్ రెడ్డి, బోడకుంటి మల్లయ్య, మూసిని రాజు, గోపాల్ రెడ్డి లు పాల్గొంటారని తెలిపారు.

# బీజేపీలో ఎవరికి వారే.. యమునా తీరే..

- పరస్పర విరుద్ధంగా వ్యాఖ్యలు..ఆరోపణలు
- కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినా కానరాని మార్పు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. జైల్లో ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదన వచ్చిందని తెలిపారు. తాను పార్టీలో ఉన్నంత కాలం అది కుదరదన్న ఉద్దేశంతోనే తనను కేసీఆర్‌కు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తనను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆరే తన నాయకుడుని, ఇతరుల నాయకత్వంలో తాను పనిచేయనంటూ కవిత చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అయితే బీజేపీ హైకమాండ్ నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ తెలంగాణ బీజేపీ నేతల తీరు మారడం లేదు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యాఖ్యలను పార్టీ నేతలే పట్టించుకోని పరిస్థితి. పార్టీకి నష్టం కలిగించేలా నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో ఎన్వీఎస్ ప్రభాకర్ కూడా జూన్ 2న బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కాబోతోందంటూ సంచలన కామెంట్స్ చేశారు. అంతేకాకుండా దుబ్బాక ఎంపీ రఘునందన్ కూడా జూన్ 2న ఎమ్మెల్సీ కవిత కొత్తపార్టీ పెట్టబోతుందంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ నేతల కామెంట్స్ సొంత పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయి. నేతల మధ్య ఏదైనా అభిప్రాయాలు ఉంటే మీడియాకు చెప్పే ముందు రాష్ట్ర నాయకత్వంతో పాటు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, ఇవి చేయడకుండా ఎవరి తోచిన విధంగా వారు మీడియా ముందుకు వెళ్లి మాట్లాడితే పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందంటూ పార్టీ నేతలకు రెండు రోజుల క్రితం కిషన్ రెడ్డి చెప్పారు. అయితే కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ నేతలు పట్టించుకోవడం లేదా లేక పార్టీలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయా అనే దానిపై పెద్ద ఎత్తున బీజేపీలో చర్చ జరుగుతోంది.



## రాష్ట్రం సహకరించకున్నా

# కేంద్ర నిధులతో పనులు

- రైల్వే ప్రమాదాల నివారణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**సికింద్రాబాద్, మన చౌరాస్తా :** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధిక రైల్వేలైన్లు, రైల్వేస్టేషన్లు ఉన్నాయని దేశం నలుమూలలకు వెళ్ళే రైళ్లు ఈ ప్రాంతం గుండానే ప్రయాణించడం జరుగుతుందని రైలు పట్టాలు దాటుతూ ప్రతి ఏడు వందలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ మరణాలకు శాశ్వత పరిష్కారం కోసం మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ రైల్వే అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ లో నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక సూచనలు చేశారు. పలు నిర్ణయాలు తీసుకున్నారు. అవసరం ఉన్న ప్రతి చోట రైల్వే అండర్ పాస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేయాలని కోరారు. ముఖ్యంగా మనుషులు దాటడానికి ఎక్కువ సంఖ్యలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేయాలని సూచించారు. ఇవి లేకపోవడం వల్లనే పట్టాలమీద నుండి దాటుతూ చనిపోతున్నారని రైళ్ల సంఖ్య పెరగడం, రైళ్ల స్పీడ్ పెరగడం.. స్పీడ్ అంచనా వేయలేక మునుపటి లెక్కనే దాటేస్తామనే అతి విశ్వాసంతో రైళ్ళకింద పడుతున్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ రైళ్ళను చూసుకోక పోవడం.. చెవుల్లో ఇయర్ ఫోన్ పెట్టుకొని పాటలు వింటూ హార్న్ కొట్టిన వినకపోవడం వంటి కారణాల వల్ల మరణాల సంఖ్య పెరుగుతున్నాయని ఎంపీ ఈ సందర్భంగా రైల్వే అధికారులకు వివరించారు. ఈ బ్రిడ్జీలు సరిపోయెన్ని నిర్మాణం చేసిన తర్వాత.. ఆక్సిడెంట్స్ నివారణ కోసం శాశ్వత పరిష్కారంగా రైల్వే ట్రాక్ పక్కన ఫెన్సింగ్ వేయాలని కూడా ఈటల రాజేందర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు లేకపోయినా రైల్వే, కేంద్ర నిధులతో ఈ పనులు పూర్తి చేయాలని సూచించారు.నెల రోజుల్లో జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న రైల్వే లైన్ల పై పూర్తిస్థాయి స్టడీ నిర్వహించి రిపోర్ట్ ఇస్తామని అధికారులు చెప్పారు. కేంద్రమంత్రి నుంచి కూడా తగినన్ని నిధులు తీసుకురావాలని అభ్యర్థన చేశారు కచ్చితంగా తీసుకురావదానికి కృషి చేస్తాను అని ఈటల రాజేందర్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ డిఆర్ఎం బ్రతేష్ కుమార్ జైన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఆర్పిఎఫ్ ఎస్పి అరోమాసింగ్, సీనియర్ డిసిఎం శఫాలీ, సీనియర్ కోఆర్డినేటర్ రామారావు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మెంబర్ నర్మద, మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ దీపిక తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.








## మానవత్వం చాటుకున్న

# మంత్రి సీతక్క


హైదరాబాద్, మన చౌరాస్తా : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో మంత్రి సీతక్క ఎప్పుడు ముందు ఉంటుంది. తన మంత్రి అనే విషయం మర్చిపోయి, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటుంది. పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై ఓ వాహనదారుడు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఇదే సమయంలో అటు వైపు వెళ్తున్న మంత్రి సీతక్క వెంటనే కాన్వాయ్‌ను ఆపివేసింది. వాహనం దిగి ఫిట్స్ వచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లి చేతిలో తాళం చెవిని పెట్టారు. ఫిట్స్ వచ్చిన వ్యక్తి తేరుకునే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. అతడు తేరుకున్న తర్వాత ధైర్యం చెప్పి ఆస్పత్రికి పంపించిన తర్వాత అక్కడి నుంచి తన వాహనంలో వెళ్లిపోయారు. మంత్రి సీతక్క స్పందించిన తీరుపై పలువురు అభినందించారు.

## వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రపురం గ్రామంలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి 10 మంది డాక్టర్ల బృందం చే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మండలంలో ఉన్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, స్త్రీ సంబంధిత సమస్యలు, ఎముకలు కీళ్లు ,చెవి ముక్కు గొంతు ,చర్మ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, వెన్నుపూస, కంటి పరీక్షలు, గుండె పరీక్షలు ,చిన్నపిల్లల వైద్యులు, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, సంబంధించి అన్ని రకాల పరీక్షలకు సంబంధిత డాక్టర్లచే పరీక్షలు చేయించి దానికి సంబంధించిన మందులు, ఆపరేషన్లు ఉచితంగా అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో వాస్విక్ ఫౌండేషన్ సభ్యుడు ఆముదాల భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఒకే సినిమాకు రెండు రాష్ట్రాలు అవార్డులా!



## జ్యూరీ చైర్మన్ మురళీమోహన్

తెలంగాణ ప్రభుత్వం దాదాపు పదకొండేళ్ల తర్వాత నంది అవార్డులను గద్దర్ అవార్డుల పేరుతో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు, జ్యూరీ చైర్మన్ మురళీ మోహన్ ఆధ్వర్యంలో విజేతలను నిర్ణయించారు. 2024లో వచ్చిన సినిమాల్లోని అన్ని కేటగిరీలకు అవార్డులను ప్రకటించగా.. తాజాగా2014 నుంచి 2023 వరకు వచ్చిన సినిమాలకు బెస్ట్ ఫిలిం అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఒకే సినిమాకు ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలు అవార్డులు ఇవ్వడం మంచిది కాదన్నారు. రెండు రాష్ట్రాలు ఒకే ఏడాది అవార్డులు ఇవ్వొద్దు. ఎందుకంటే ఒక రాష్ట్రం ఒక సినిమాకు అవార్డు ఇస్తే మరో రాష్ట్రం అదే కేటగిరీలో ఇంకో సినిమాకు అవార్డు ఇస్తే భిన్నాభిప్రాయాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే ఒక ఏడాది ఒక రాష్ట్రం ఇస్తే ఇంకో ఏడాది ఇంకో రాష్ట్రం అవార్డు ఇవ్వాలి. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలు ముఖ్యమే. ఎవరు ఎక్కువ కాదు.. ఎవరు తక్కువ కాదు. కాబట్టి రెండు రాష్ట్రాలు ఈ విషయంలో అవగాహనకు రావాలని మురళీ మోహన్ అన్నారు.



# ముగ్గురు హీరోల భైరవం

## తెలుగు నేటివిటీకి తగ్గట్లుగా మార్పు

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్.. ఇలా ముగ్గురు హీరోల కలిసి ఓ సినిమా చేస్తున్నారంటే ఖచ్చితంగా సినిమాపై ఆసక్తి ఏర్పడుతుంది. పైగా ఈ ముగ్గురూ సినిమాలకి కొంత విరామం ఇచ్చారు. అలాంటి ముగ్గురు హీరోలు కలిసికట్టుగా 'భైరవం'తో ప్రేక్షకులు ముందుకు రావడం విశేషం. పైగా ఇది తమిళ 'గరుడన్' రిమేక్. తమిళ్ లో ఈ కథ మంచి విజయాన్నే అందుకుంది. కథ: గజపతివర్మ (మంచు మనోజ్), వరద (నారా రోహిత్) ఇద్దరూ మంచి మిత్రులు. వీరిద్దరి నమ్మిన బంటు శ్రీను (బెల్లంకొండ సాయి శ్రీనివాస్). ఆ ఊర్లో వారాహీ అమ్మవారి గుడికి చెందిన భూముల మీద దేవాదాయ శాఖ మంత్రి (శరత్ లోహిత) కన్ను పడుతుంది. ఈ కుట్ర ప్రాణ స్నేహితులైన గజపతి, వరద, శ్రీను మధ్య ఎలాంటి విభేదాలని తీసుకొస్తుంది? ఎలాంటి పంతానికి కారణం అవుతుంది? గజపతి భార్య నీలిమ (ఆనంది), వరద భార్య పూర్ణిమ (దివ్యా పిళ్ళై), శ్రీను ప్రేమించిన అమ్మాయి వెన్నెల (అదితి శంకర్) ఈ కథలో ఎలాంటి పాత్రలు పోషించారు? అనేది మిగిలిన స్టోరీ.ఒరిజినల్ గా వెట్రిమారన్ తయారుచేస్తున్న కథ ఇది. ఆయన కథల్లో డెప్త్ వుంటుంది. కథ పరంగా చూసుకుంటే గరుడన్ బలమైనదే. గరుడన్ సినిమా చూసిన జనాలు కూడా కథ బావుంది కానీ స్క్రీన్ ప్లే లో కొత్తదనం లేదనే విమర్శ చేశారు. దర్శకుడు విజయ్ కనకమేడల ఈ కథని తెలుగులో ఆడియన్స్ అభిరుచికి తగ్గట్టుగా మలచడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నంలో ఓ మాస్ కమర్షియల్ సినిమాని తీర్చిదిద్దడంలో కొంతమేరకు సక్సెస్ అయ్యాడు. చైల్డ్ వుడ్ ఎపిసోడ్ తో కథ మొదలౌతుంది. అయితే అది కాస్త నీరసంగానే సాగుతుంది. ముగ్గురు హీరోల పాత్రలు ఎస్టాబ్లెస్ చేసిన తర్వాత కథలో జోష్ వస్తుంది. ముఖ్యంగా ఇంటర్వెల్ కి ముందు ఓ ముప్ఫై నిముషాలు ఆడియన్స్ కథలో ఎంగేజ్ చేసే విధంగా యాక్షన్ ని డిజైన్ చేశాడు దర్శకుడు. మిత్రులు శత్రువులుగా మారడం, ఇంట్రవెల్ బ్యాంగ్ తీర్చిదిద్దిన తీరు, గుడి నేపథ్యంలో సాగిన యాక్షన్ సీక్వెన్స్, శ్రీను క్యారెక్టర్ పూనకం... ఇవన్నీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అయితే సెకండ్ హాఫ్ డ్రామాని పండిరచడంలో తడబడిరది. కథలోని ఆత్మని పట్టుకోకుండా యాక్షన్ మోడ్‌లోకి నడిపేశారు. కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఫోర్స్ ఫుల్ గా అనిపిస్తాయి. గరుడన్ సమస్య కొత్తదనం లేని స్క్రీన్ ప్లే. తెలుగులోనూ అదే మైనస్ గా కనిపించింది. ఒక దశలో కథ ఊహకు అందిపోతుంది. అయితే మాస్ కమర్షియల్ సినిమాలని ఇష్టపడే ఆడియన్స్ కావాల్సిన కంటెంట్ అయితే ఇందులో వుంది. సినిమా డీసెంట్ గా వుంది. శ్రీచరణ్ బీజీఎం బావుంది. యాక్షన్ సీన్స్ ని ఎలివేట్ చేసింది. పాటలు రిజిస్టర్ కాలేదు. హరి కెమరా వర్క్ సినిమాకి మంచి ఫీల్ ని తీసుకొచ్చింది. గుడి సెట్ రియల్ గా వుంది. ఎడిటర్ ఇంకాస్త పదునుగా వుండాల్సింది. సినిమా బిగినింగ్, సెకండ్ హాఫ్ లో కొన్ని సీన్స్ ఇంకాస్త షార్ఫ్ గా చెప్పాల్సింది. కొన్ని డైలాగులు పేలాయి. దర్శకుడు విజయ్ మాస్ కి నచ్చే ఎంటటైనర్‌గా ఇవ్వగలిగాడు.





# బాలకృష్ణకు ఎన్టీఆర్ అవార్డు

తెలంగాణ ప్రభుత్వం పదకొండేళ్ల తర్వాత సినిమా అవార్డులను గద్దర్ పేరుతో ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా 2014 నుంచి 2023 వరకు ఉత్తమ చిత్రాలకు అవార్డులను ప్రకటించారు. ఇందులోనే స్పెషల్ అవార్డులుగా ఆరు అవార్డులను ప్రకటించారు. అందులో ఎన్టీఆర్ జాతీయ అవార్డును నందమూరి బాలకృష్ణకు ప్రకటించారు. ఈ అవార్డుపై బాలకృష్ణ స్పందించారు. ఎన్టీఆర్ అవార్డు రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. 'ఓవైపు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇంకో వైపు ఎన్టీఆర్ నట ప్రస్థానానికి 75 ఏళ్లు పూర్తయిన అమృత ఘడియాలు ఉన్నాయి. ఇలాంటి అద్భుతమైన సమయంలో 'ఎన్టీఆర్ జాతీయ అవార్డు' నాకు రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆ దేవుడి వరంగా, నాన్నగారి ఆశీస్సులుగా అనుకుంటున్నాను. ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డుకు నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సీఎం రేవంత్ రెడ్డి గారికి, జ్యూరీకి ధన్యవాదాలు. ప్రపంచ నలమూలలా ఉన్న తెలుగు ప్రజలు నన్ను దీవించడం వల్లే నాకు ఈ అవార్డు వచ్చిందని అనుకుంటున్నాను. మీ ప్రేమ, అనురాగం నా మీద ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అని బాలకృష్ణ ఎమోషనల్ గా స్పందించారు.

# తప్పుచేస్తే..క్షమాపణ కోరేవాడిని..



స్టార్ యాక్టర్ కమల్ హాసన్ ఇటీవల తన కొత్త సినిమా థగ్ లైఫ్ ప్రమోషన్ కార్యక్రమంలో కన్నడ భాష గురించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. కన్నడ భాష తమిళం నుంచి పుట్టిందని ఆయన వ్యాఖ్యానించడంపై కన్నడిగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం కర్ణాటకలో రాజకీయ రంగు పులుముకుంది. కమల్ హాసన్ సినిమాను రాష్ట్రంలో బ్యాన్ చేస్తామని రాజకీయ పార్టీలు హెచ్చరించాయి. అయితే, తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పడానికి కమల్ హాసన్ నిరాకరించారు. తన వ్యాఖ్యలు తప్పు అని భావిస్తేనే క్షమాపణలు చెప్పేవాడిని సమర్థించుకున్నారు. 'నాకు గతంలో బెదిరింపులు వచ్చాయి. కానీ ప్రేమ ఎప్పుడూ గెలుస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ పట్ల నాకు ఉన్న ప్రేమ నిజం. ఒక ఎజెండా ఉన్నవారు మాత్రమే వేరే విధంగా అనుమానిస్తారని ఆయన అన్నారు. ఇది ప్రజాస్వామ్యమని, తాను చట్టాన్ని, న్యాయాన్ని నమ్ముతానని చెప్పారు. మరికొన్ని రోజుల్లో డీఎంకే మద్దతుతో రాజ్యసభలో అడుగుపెట్టనున్న కమల్ హాసన్ ఈ వ్యాఖ్యలతో దుమారాన్ని రేపారు. భాషను అమితంగా ప్రేమించే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోఇది పెద్ద వివాదంగా మారింది. కన్నడ రక్షణ వేదిక అతడిపై కేసు నమోదు చేసింది. కర్ణాటకలో సినిమా బిజినెస్ కావాలి, అయినా కూడా కన్నడను అవమానిస్తారా..? అని కన్నడ ప్రజలు మండిపడుతున్నారు. కన్నడ కన్నా తమిళం గొప్పదనే ప్రయత్నం చేస్తున్నాడని కమల్ హాసన్‌పై విరుచుకుపడుతున్నారు.